# కవి సార్వభౌమ రెవ. పురుషోత్తమ చౌధరి - సాహిత్య సేవ

కవి సార్వభౌమ రెవ. పురుషోత్తమ చౌధరి 200 ల జన్మ దినోత్సవ సంధర్భంగా జరిగే సాహిత్య సదస్సులో కవిగారి సాహిత్య సేవను గూర్చి లఘు వ్యాసాన్ని వ్రాసే భాగ్యమును ప్రసాదించిన ప్రభుయేసుస్వామికి నిండు హృదయంతో వందనములు చెల్లించుకొంటున్నాను. రెవ. డా॥ రావెల జోసఫ్‌గారు కవిసార్వభౌముని సాహిత్య సేవను గూర్చి వ్రాయుమని అడిగారు. నా పట్లనున్న ప్రేమకు, ఇలా నన్ను ప్రోత్సాహిస్తున్నందుకు క్రైస్తవ కవి సామ్రాట్ రెవ. డా॥ రావెల జోసఫ్‌గార్కి నానమస్సులు.

కవి సార్వభౌమ చౌదరి పురుషోత్తముగారి సాహిత్య సేవను గూర్చి విశ్లేషణ వ్రాయాలంటే నాబోటివాండ్లకు చాలా కష్టము. ఎందుకంటె కవిత్వము, పద్యములు, ఛంధస్సుతో కూడిన రచనలు, తెలుగు, వ్యాకరణాంశాలతో ఉండే సాహిత్య, ప్రవేశం నాకు లేదు. నా శక్తి, జ్ఞానము అల్పము. అందుచే ఇది గొప్ప సాహసము కాని ఇలాగైనా కవిగారి కొన్ని రచనలు చదివే భాగ్యము లభిస్తుందని ఆశించాను, ధన్యుడనై సంతోషిస్తున్నాను. అయితే నేను వ్రాసిన ఈయా వ్యాసములో తప్పులు దొర్లినచో సాహిత్య వేత్తలైన మీరు దయతో మన్నించి తగురీతిగా అర్ధంచేసుకొని ప్రోత్సాహిస్తూ కోరుతూ ఈ వ్యాసాన్ని మీ ముందుంచుచున్నాను.

కవి సార్వభౌమ పురుషోత్తమ చౌధరి సాహిత్య కృషి లో వచన గ్రంథాలు, పత్రికలు, పదకావ్యాలు భక్తి సంకీర్తనలు, శతకాలున్నాయి. చౌధరిగారికి సంస్కృతము వంగ ఒరియా తెలుగు కన్నడ భాషల్లో పరిచయముండె. సుమారు 20సం॥ ప్రాయం నాటికే కవిత్వంలో నిష్ణాతులైనారు. క్రీస్తుని తన రక్షకునిగా అంగీకరించిన అనంతరం తటస్థపడిన ప్రతి సంఘటన ఒక కథావస్తువై, ప్రతి అనుభవం ప్రేరణ అయి, భక్తి, అనుభవ జన్యమై విలసిల్లింది. చౌధరి వారు వ్రాసిన <u>కులాచార పరీక్ష</u>, <u>ముక్తిమార్గ ప్రదర్శనం</u> అనేవాటిని శ్రీ బాబుజాన్ చౌధరిగారు పత్రికలుగా పేర్కొన్నాడు.

<u>పత్రికలు</u> :

తెలుగు క్రైస్తవసంఘానికి కవి పితామహుడైన పురుషోత్తమ చౌదరిగారు విశాఖపట్నం చేరి జాన్‌హేకి చేయూతగా నుండి భాషాంతీకరణం సాగిస్తున్న రోజుల్లో రక్షణ చరిత్ర, ముక్తి మార్గ ప్రదర్శనం, మనసేమూలం అంధకార నాశనం, మసాచి, పిసాచి, సంకట భ్రాంతి నివృత్తి, జగన్నాధ పరీక్ష, కులాచార పరీక్ష మున్నగు పత్రికలు వ్రాసారు.

కులాచార పత్రికని పురుషోత్తమ కవి 1833వ సం॥లో వ్రాసారు. యేసుప్రభుని స్వీయ రక్షకునిగా అంగీకరించి బహిరంగంగానే యజ్ఞోపవీతాన్ని విసర్జించి బాప్తీస్మాన్ని తీసుకొన్న కవిగారు స్వజనుల, బంధు మిత్రుల, స్వమతస్థుల విమర్శలను, తృణీకారాన్ని ఎదుర్కొన్నారు. అయితే పురుషోత్తమ చౌధరిగారు పురణాల్లోని శ్లోకాల్నే, ఆకారాలుగా చూపుతూ కులం అనేది శూన్యమని నిరూపించడానికి కులాచార పరీక్ష అనే పత్రికను వ్రాసాడు. దేవుడు ఆదాము అవ్వలను సృష్టించాడని, ఆ ఆది దంపతుల పాపం ద్వారా మనందరం పాపులమై యున్నామ చెప్పి అట్టి పాపపరిహార్థమై దేవుడు యేసుక్రీస్తుగా అవతరించి, సిలువ మీద మరణించి, పాప ప్రాయశ్చిత్తమొనర్చినాడని వివరించెను. రక్షణ అందరికి చెందినది. కులమనేది అజ్ఞానపు అనాచారమని కేవలం బ్రాహ్మణులు కల్పించిన తంత్రమే అని కులమెక్కడుందని, హేతుబద్ధంగా ప్రశ్నించిన ధీశాలి. అతి నిష్ఠాపరులుగాను, బ్రాహ్మణులే ఎక్కువ యని తలంచువారికి బ్రాహ్మణుడైయుండి పురణేతివాసాలా జొపాస పట్టిన వాడైయుండి

ఒక వేళ బ్రాహ్మకులం గలిగినవాడైతే ఆయనుండి పుట్టిన నలుగు కొడుకులు నాలుగు వేర్వేరు బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య, శూద్ర కులాలుగా ఎట్లా అవుతారని ఆవేశముతో ప్రశ్నించారు. అంతేగాకుండా తన వాదాన్ని బలపరచుకోవడానికి పురాణాల్లోని దక్షుని సంతతి, గంగ, ఊర్వశి, వశిష్ఠుడు, మొదలగువారి బ్రాహ్మణత్వాన్ని ప్రశ్నిస్తాడు కవి పుంగవుడు.

గీ|| తల్లి యూర్వశి లంజె తనయాలి మాదిగె
తాను బ్రాహ్మణుడయ్యె ధర వశిష్ఠ
తపముచే విప్రుడు తర్కింప కులమేది?

తనపట్ల కోపమును పక్షపాతబుద్ధిని గ్రహింపక మనస్సుంచి ఆలోచించి చిత్తగించుడని విషయాన్ని వివరించాడు. జాత్యహంకారంతో మిట్టుపడేవారికి ఈ పత్రిక దివ్యాంజనంగా ఉపకరిస్తుంది.

కవి ఆహారపు అలవాట్లను గూర్చి కూడా వేమన పద్యాన్ని దృష్టాంతంగా చూపాడు.

గీ|| మాలమాంసము దిను మరి సర్వజనులెల్ల
క్రొవ్వుదిందు రొక్క కులముకాదె
కులములెల్ల నొక్క గులమనే తెలియుడీ

నీతిలేని బ్రాహ్మణుని కంటే నీతిశాలి చండాలుడు అధికుడని భాగవతంలో ప్రహ్లాదుని మాటలనుదహరించెను.

మరియు జగన్నాథ క్షేత్రాన్ని గూర్చి వ్రాస్తూ, ఈగలు, దోమలు ముసిరిన దివ్య ప్రసాదం తినకపోతే కండ్లు పోతాయనడం హాస్యాస్పదమని, దివ్యప్రసాదాన్ని తిన్న గ్రుడ్డివాడికి దృష్టి ఎందుకు రాదు అని ప్రశ్నిస్తాడు. మనుష్యుల్లో ఉద్యోగ భేదమే గాని జాతి భేదము లేదని చెప్పడానికి మెత్తని వర్షము కురిసిన నేలపై సాగి వెళ్లిన వివిధ జంతువులు, ఏనుగు, ఒంటె, గుర్రము, గాడిద, పులి, పంది మొదుగు, ఇంకోవైపు మానవులు – బ్రాహ్మణుడు, రాజు, కోమటి, శూద్రుడు, చాకలి, మంగలి మొదలగు జీవులు నడచిపోగా జంతువుల అడుగుల్లో జాతిని పోల్చవచ్చును గాని మానవుల అడుగుల్లో జాతిని పోల్చలేమని అద్భుతంగా విమర్శ చేసాడు.

ముక్తి మార్గ ప్రదర్శనం :

ఈ పత్రికలో కవి తాను సత్యాన్వేషణలో కనుగొన్న ముక్తిమార్గాన్ని వివరించాడు. హిందూ మతంలోని వివిధ శాఖల్లో ముఖ్యమైన శైవ, వైష్ణవ మతాల్లో ఇష్ట దైవాలు ఎలా పరస్పరం దూషించుకొన్నారో పురాణ ఇతిహాసాలనుండి, చరిత్రకావ్యాలనుండి నిదర్శనాలను చూపాడు. ప్రాచీన కావ్యాలతో, సాహిత్యంతో కవికి గల పరిచయం, పరిజ్ఞానం దీన్నిబట్టి తెలుస్తుంది. దీనిలోనే పురాణపురుషుల జీవితాలను పద్యరూపంలో వ్రాసి విశ్లేషించి యేసుప్రభుని పాపరాహిత్య జీవితాన్ని కూడా చర్చించాడు. ఈయన కులాచారం అనే జాడ్యాన్ని సమాజం నుండి దూరపరచడానికి తన సాహిత్యం ద్వారా శ్రమించి గొప్ప సాంఘిక సంస్కర్తగా కనిపిస్తాడు. ముక్తిమార్గాన్వేషణలో తాగనుగొన్న సత్యాన్ని చెప్పడం ద్వారా అనేకులు తనవలె క్రీస్తును వెంబడించేవారుగా వుండాలని ఆశించాడు.

<u>శతకము</u> :

ఆంధ్ర సాహిత్య చరిత్రయందు శతకము ప్రముఖ స్థానాన్ని వహించింది. శతకమనగా నూరు అని అర్థము. ఇట్టి రచన అతిపురాతన కాలంనుండి వున్నట్లు తెలుస్తుంది. ఋగ్వేదములో ఇంద్రుడు అగ్ని రవి వరుణుడు మొదలైన దేవతల స్తోత్రముల సముచ్చయమని చెప్పవచ్చు. శతకములో వంద గానీ, నూట ఎనిమిదిగానీ, పద్యాలుంటాయి. పద్యాంతమున భగవత్ సంబోధనారూపమైన మకుటము వుంటుంది. చంపకము, ఉత్పలమాల, మత్తేభ శార్దూలాలు సీస కందాలు ఇత్యాదులుంటాయి. శతకాలు సాధారణంగా గ్రంథకర్త ఆత్మ భావాలను ప్రకటించేవిగా వుంటాయి. కవియొక్క నిజహృదయాంతరాళాలను, భగవంతునికి బయలుపరచుటకై చేయు సంభాషణాలివి. పురుషోత్తమ చౌధరి రెండు శతకాలను వ్రాసాడు. 1. యేసునాయక శతకము, 2. యేసుక్రీస్తు ప్రభు శతకము. క్రీస్తును స్వీకరించిన తాను తనకు క్రీస్తుతో గల ప్రత్యక్షానుభవాన్ని భక్తి భావాన్ని రంగరించి, ఈ రెండు శతకాలను ప్రాచీన భక్తి శతకాలతో తులతూగునట్లు విశిష్టమైనవిగా రచించాడు. చౌధరి శతకాలు వేదాంత, తత్వవేదాంతమయములై అర్థం కాని వేద సారమును చదువరులకు సులభంగా అందచేయును.

కావ్య సాంప్రదాయాన్ని బట్టి శ్రీకారముతో ప్రారంభిస్తాడు. యేసునాయక శతకంలో " శ్రీకరమై సుధీ జన వశీకరమై నిజభక్తి నిత్యసౌఖ్యాకరమై సమస్త జగదావన పావన రక్త సిక్త శోభాకరమై".. అని, యేసుక్రీస్తు ప్రభు శతకంలో " శ్రీరాజిల్లు భవత్పదాబ్జములు నా చిత్తంబులో నిల్పినే, కరుణామృత బిందుబృందములు... " అని వేడుకొంటాడు. యేసు నాయకశతకంలో 25వ పద్యములో దేవునికి కనబడకుండా మానవులు మోసము చేయగలరా? అనేదాన్ని చెప్పడానికి " యినరుచి మాయబోయిన తిమిస్రము లేమగు యేసు నాయకా " అని వ్రాసాడు. యినుడు - సూర్యుడు రుచి - కిరణాలు (ప్రకాశము) మాయబోయిన, తిమిస్రము - చీకటి 'ఏమగును? అని ప్రశ్నిస్తాడు. 48వ పద్యములో విగ్రహారాధనాదుల వ్యర్థతను, 89వ పద్యంలో అన్యదేవతల యెడ భక్తిని విరక్తిని చూస్తాం.

" పలుకులు వేయునేల తన పాద సరోజ మరంద పానము,
ద్విలసిత మానసాళి యవివేక నరవళి గొల్చు వెఱ్ఱివే
ల్పుల కడకేగదయ్య ఘన పుష్పకణంబులు గ్రోలు చాతకం
బెలమిని చేట గోతికడకేగని రీతిని యేసునాయకా ॥

ఇక్కడ అలంకార పూరితమైన వివరణ అద్భుతం. మీ పాద పద్మములలోని తేనెను పానము చేసిన నా మనసనే తేనెటీగ జ్ఞానము లేని మానవులు సేవించు వ్యర్థమైన దేవతల యొద్దకు పోనేరదు స్వామి! ఎట్లనగా, చంద్రుని కిరణాలు పానము చేయు చకోర పక్షి చేట గుంటలోకి పోనేరదు గదా యేసునాయకా అంటాడు.

98వ పద్యంలో

" కలిగెగదా మదాత్మకృత కల్మష ధౌత పవిత్రరక్తమున్,
గలిగెగదా భవత్కరుణ కారణ జీవన మంత్రరాత్మలో,
గలిగెగదా త్వదంఘ్రియుగ కొల్వల భక్తికి శక్తియుక్తులున్
గలిగె గదా సదామది సుఖంబభి లంబును యేసునాయకా ॥

ఈ పద్యములో <u>గలిగెగదా</u> అనేది నాలుగు చరణాల్లో రావడం, అద్భుత పదజాలాల పొందిక, ఛందోబద్ధవివరణ మరియు పద్యభావము విశిష్టంగా వుంది. కవి నా ఆత్మ చేసిన పాపం కడిగివేయ పవిత్రరక్తం నాకు దొరికింది, నా ఆత్మకు నీ కృపచే జీవనం లభించింది. నాకు నీ పాద ద్వయమునందు భక్తి, శక్తి, ప్రాప్తించింది. నా హృదయానికి ఆనందం కలిగిందని తన్మయుడవుతాడు.

యేసుక్రీస్తు ప్రభు శతకంలో కవి దేవుని వాక్యాన్ని గూర్చి 5వ పద్యములో ఇలా వివరించాడు -

> దురితారణ్య దవాగ్నియై సుజనచేతోమోద బోధ స్ఫుర
> ద్వరదీపాంకురమై విశద మద గర్వ ధ్వాంత మార్తాండచం
> డరుచి ప్రస్ఫుటమై వెలుంగు తన దార్ఢ్యంబైన వాక్యంబునా
> యరి బృందంబుం దొలంగగా నొసగుమయ్యా యేసుక్రీస్తు ప్రభో ।

పాపమనే అడవిని దేవుని వాక్యము కారుచిచ్చువలె దహిస్తుందని సజ్జనుల మనసుకు ఆనందమునిచ్చు బోధయను దీపమని సాతానుయొక్క గర్వాంధకారాన్ని పోగొట్టే సూర్య కిరణమని యిట్టి నీ వాక్యం నా శత్రువులను పారద్రోలుటకు నాకిమ్మని వేడుకొన్నాడు.

ఈ శతకాల్లో క్రీస్తు నామ గుణ కీర్తనలు, పశ్చాత్తాప భావ వ్యక్తీకరణలున్నాయి. తనను కనికరంతో బ్రోవుమని వేడుకోవడం, పతితుల హృదయాలని స్పందింపచేస్తుంది. తనను నమ్మిన వారిని కరుణిస్తాడని దాసికి ఋజువు మరియు, లాజరు సిలువపైన దొంగ మొదలగు వారు క్రీస్తు కృపా సంపన్నతలో రక్షణను అనుభవించారని చెపుతాడు. క్రీస్తుప్రభుని శ్రమలు, సిలువ మరణాన్ని కండ్లకు కట్టేలా అద్భుతంగా వర్ణించాడు. తాను అజ్ఞానినని దేవుని స్తుతింప శక్తిలేనివాడనని తెలిపి, తనకు విజ్ఞానాన్ని ప్రసాదింపమని వేడుకొంటాడు. యేసుని పునరుత్థాన దృశ్యాన్ని ఒక్కసారి తన కనులారా చూడ భాగ్యాన్ని కలిగించమని వేడుకొంటాడు. శతకాల్లో ప్రత్యేకమైన ప్రబోధాన్ని జనులకిచ్చాడు. ముక్తిప్రదాత క్రీస్తుని శరణు వేడండని, ప్రేమ సందేశాన్ని అందుకొని జీవింపమని, క్రీస్తుని ఆశ్రయించుడని హెచ్చరిస్తాడు. చివరిగా ఈ శతకాలను చదివిన వారికి యేసుప్రభువు శాశ్వతానందాన్ని ప్రసాదించాలని కోరుకొంటాడు.

<u>పద్యకావ్యములు :</u>

చౌధరిగారు రచించిన పద్యములు అందరికి సులభంగా అర్థమయేరీతిలో ఛందోబద్ధమై గంభీర నడకతో వుంటాయి. కవి మొదటిగా పంచచామర పన్నములు వ్రాసి తదుపరి పంచరత్నములనే ఐదు సీసపద్యాలను రచించాడు. పంచచామర పన్నములు 50 పద్యవృత్తములతో క్రీ.శ. 1847లో కవి వ్రాసాడు. పంచచామరమనేది ఛందస్సులోని ఒక వృత్త విశేషం. పన్నము అంటే వేదములోని ఆట్టములోని భాగమని అర్థము. కవితాను పాపినని ప్రభువే దిక్కు అని శరణు వేడడం ముఖ్యవిషయంగా వుండి నిత్యజీవం యిచ్చిన ప్రభుని మనసార స్తుతించడం తాదాత్మ్యం పొందడం గమనించవచ్చు. " కరంబులెత్తి మ్రొక్కి వంచి కన్నుదోయి నీ వరాంఘ్రులాత్మలో దలంచి " యని వినయంతో కావ్య రచన ప్రారంభిస్తాడు. " ధీరాన నా మొరాలకించు దీనదాసినాసనై నరేపరాకు చిత్తగించి జాగుసేయ నీ కృపా తరంగ వాక్సుధాబ్ధి ముంచి తాపహార్చు . .. అనడం ఎంతో సహజంగా వుంది.

పంచరత్నములను ఐదు సీస పద్యములు క్రీ.శ. 1847లో కవి వ్రాసాడు. ఈయన సీస పంచకాన్ని ఎన్నుకొని చివరన రెండు కంద పద్యాలు చేర్చాడు. మొదటి పద్యంలో ఎవ్వడు తనజేన నిమిడించి కొలుచు నీ యాకాశమండలం బద్భుతంబుగ యని దేవుని సర్వశక్తిమత్వాన్ని కీర్తిస్తాడు. జేన - ఆకాశము; కుంచం - భూగోళం; తూనికరాళ్ళు - తరాజు - పర్వతాలు సముద్రములోని నీళ్లను పుడిసిటిలో పట్టగలడని జీవరాసుల్ని త్రాసులో పెట్టగలడని అట్టి గొప్పదేవుడు నా తండ్రియెహోవా యని వర్ణించుట అమోఘం.

రెండవ పద్యంలో దేవుని చేతిలో ప్రపంచమంతా పువ్వుల చెండువలె చిన్నదిగా నున్నదని వర్ణించాడు. ఇక్కడ పిల్లలు ఆడుకొని చెండు - బంతి యాటను తలపింపజేస్తాడు. మరియు నెవ్వని కాంతియందు సూర్యచంద్రులు మెరుగుడు పురుగులట్లెరుగబడును. ఎవ్వని యొడిగట్టు నీ తారాలన్నియు మల్లెల మొగ్గలరీతి గిల్లబడును అనే పాదంలో స్త్రీలు మల్లెచెట్టునుండి మల్లెపూలను తమ ఒడిలో కోసుకొనుచుండాన్ని చూపిస్తూ దేవుని ఒడిలో తారలు అట్లున్నవని చెప్పుట గొప్ప వర్ణన అయి వున్నది.

మూడవ పద్యంలో సర్వ ప్రపంచానికి దేవుడు తన ఆధీనంలో, అధికారం క్రింద వుంచాడని చెప్పడానికి " పగటెండ, రేయెండ, పాన్పులట్లుగ చుట్టబెట్టి వేరొకచోట పెట్టునెవ్వడో " అని వ్రాయడంలో కవి చిత్రణ చాలా బాగుంది. సూర్య కిరణాలవలన ఏర్పడిన పగటి ఎండను చంద్రుని కిరణాల వలన ఏర్పడిన రాత్రి వెన్నెలను చాపవలే చుట్టునని చెప్పడం అద్భుతం.

నాలుగవ పద్యం దేవుని కళ్యాణ గుణాలను కీర్తిస్తూ, దేవుని రాజుగాను, సత్యము, ప్రేమ, సంతోషం అనే గుణ లక్షణాలపై ఆయన సింహాసనమున్నదని, దేవుడు ధర్మాత్ముడుగా సమస్త జీవరాసులకు <u>దినాహారాన్ని</u> యిచ్చి పోషిస్తున్నాడని వ్రాసాడు.

ఐదవ పద్యంలో " జీవ నిర్జీవ స్థానావళిలో చిన్న పురుగైన తృణమైనా మరువడెవడు - తండ్రి తనయుండు విమలాత్మ తానె యగుచు " అని రచించి దేవుని అపార కరుణను త్రిత్వస్వభావాన్ని కీర్తించాడు. దీనికి అనుబంధించిన రెండు చివరి కంద పద్యాలలో పైవాటిని దేవుని కృపచే రచించానని, వీటిని చదివిన వారికి దైవాశీర్వాదం కలగాలని ఆకాంక్షను వెల్లబుచ్చాడు. ఆయన పద్య కావ్యాలన్ని సత్కావ్యాలక్షణాలతో అలరారుచున్నాయి. అక్షర రమ్యత రమణీయతం క్రైస్తవ పదములు, హైందవ తత్వ పదములు ఈ కావ్యాలలో రెవ. పురుషోత్తమ చౌధరి కలము నుండి జాలువారినవి.

<u>చౌధరి భక్తి గీత రచనలు :</u>

రెవ. చౌధరి కవియే గాక మంచి గాయకుడు కూడా. మత దీక్షను గైకొన్నప్పుడు వ

" మా యేసుక్రీస్తుని మరుగు గల్గెనురా నా ఆత్మ ఘనరక్షనగము నెక్కెనురా అని మొట్టమొదటి భక్తి గీతాన్ని పాడాడు. కటకపురిలో క్రైస్తవ సంఘంతో తన అనుబంధాన్ని తెలుపుతూ " సనసత్క్రైస్తవ గోష్ఠి నాకబ్బెనురా " యని ఉప్పొంగిపోయాడు. ఈయన కీర్తనలలో చరణాలు, చంధోబద్ధంగాను, యతిప్రాసల నమరికతో కూడి ప్రతి చరణములోను భక్తి భావాన్ని ప్రతిగీతం ఒ క్రొత్త నడవడికను ఒరవడిని కలిగి యుండును.

కలం చిందులు గొప్పగా తెలుస్తాయని చెప్పారు. డా॥ సుందర్రావుగారి మాటల్లో చెప్పాలంటే చౌధరి గీత రచనల్లో పల్లవికి పాద ముగింపుకు కావించిన బిగింపు వృత్త్యనుప్రాసల పోహళింపు, ఉపమ ఉత్ప్రేక్షాలంకారాల చలాయింపు, భావాల మదింపు తెలుగు భాషకొక సొంపు పాఠకుల చెవికొక ఇంపు అని కీర్తనల యొక్క శ్రేష్ఠతను గూర్చి ప్రత్యేకతను గూర్చి ప్రస్తావించాడు. యతి పోషణలో కవి అద్భుతంగా రచించాడు. ఈ కీర్తన అన్ని కీర్తనలలో అనుభవ భక్తి, మధుర భక్తి, ధోరణులు ఎక్కువగా కనిపిస్తాయి. పఠితులను , పాఠకులను పారవశ్యములో ముంచెత్తుతాయి.

క్రైస్తవ నీతి ప్రకాశమనే కవి రచనలో విశిష్టమైన అలంకారాలు ఉపయోగించబడ్డాయి. దేవుని మానవుని, ప్రపంచాన్ని గూర్చిన విభిన్నమైన ప్రక్రియలు రచనలో కనిపిస్తాయి. ఉపోద్ఘాతంలోని 9వ పద్యములో

చ ॥ అనుభవవేద్యమైన హృదయ భ్రమరంబుల చేత క్రీస్తుయేసుని చరణారవిందములు, చుట్టి తడియు మకరంద
మాధురీ ఘన రసమని, యాని సుఖ కౌశల....

క్రీస్తు పాద పద్మములను చుట్టుకొని అందున్న మధురమైన మకరందాన్ని తమ హృదయాలనే తుమ్మెదల వల్ల పాలించి ధ్యానించి, అనుభవ సుఖము పొందిన క్రైస్తవులు సంతోషించునట్లు నా కవిత్వమును తెలియజేసెదనని కవి అంటాడు. ఈ రచనలో రెవ. చౌధరి క్రొత్తనిబంధనలోని క్రీస్తు పౌలు యోహాను, యాకోబు మొ॥ లగు వారి ప్రబోధాలను తీసుకొని చక్కగా వర్ణించాడు. మూడవ పద్యములో క్రీస్తు నిన్ను పోషించునని చింతింప వలదని వివరిస్తాడు. 5వ పద్యములో దేవుని రాజ్యాన్ని మొదట వెదకాలని, అప్పుడు అన్ని దీవెనలు నీకు నొసంగబడునని చెప్పాడు. 15వ పద్యములో పాపమనగా మహోన్నతుని ఆజ్ఞ మీరుటయేనని చెప్పాడు. తర్వాత పొరుగువాని ప్రేమను గూర్చి, ఏకాంత ప్రార్థనను గూర్చి వ్రాసాడు.

<u>విశిష్ట వర్ణనలు :</u>

97వ పద్యములో ప్రావృడ్జలదమునకు - వర్షాకాలపు మేఘమునకు

110 లో తోషణ - సంతుష్టి , 111 లో యేసుపాద పంకేరుహ - యేసుపాద కమలములు

112 లో దిక్షురసము - చెఱకు రసము, 117 లో వృజినాటవి కలారా - పాపమనెడి అరణ్యమునకు గొడ్డలివంటి వాడా, అను వివిధ విశేషణాలతో పద్యాలను వర్ణించాడు.

రెవ. చౌధరి విషయ వర్ణనాచాతుర్యము అద్భుతము. ఈయన అలంకార రచనల్లో గొప్ప వైశిష్ట్యముంది. రసపోషణము, శైలి విశేషాలు సరళము, హృదయాంగమములు. ఆయన కవిత నవనీత మార్దవము. పురుషోత్తమ చౌధరి క్రైస్తవ భక్తి గీత రచనకు శ్రీకారం చుట్టి తెలుగు క్రైస్తవులకు మాత్రమే గాక తాను ప్రయోగించిన వివిధ ప్రక్రియల ద్వారా మొత్తం సాహితీ ప్రియులకే చిరస్మరణీయుడయ్యాడు. అట్టి కవితా మూర్తిని మననించి ప్రస్తుతించెద...

వ్యాసకర్త :
రెవ. వి. మాణిక్యరావు,
ప్రొఫెసర్, ఎసిటిసి.